

కరాటేలో ప్రతిభ చాటిన 'విజయభారతి' విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కరాటే పోటీలలో విజయభారతి హైస్కూల్ విద్యార్థి ప్రతిభ చాటాడు. ఈ నెల 16వ న తమిళనాడు రాష్ట్రం, ఊటీ అన్నా స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో రైజింగ్ గోజు కరాటే స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో మదనపల్లె విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి కే.చరణ్ తేజ -13ఏళ్ల కటా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు.



విద్యార్థిని అభినందిస్తున్న విజయభారతి సేతు

ఈ సందర్భంగా బుధవారం విజయభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సేతు విద్యార్థి చరణ్ తేజను అభినందించారు. ప్రతిభతో పాటు పథకాలు సాధించినప్పుడే కరాటే విద్యార్థులకు తగిన గుర్తింపు వస్తుందన్నారు. కరాటేలో శిక్షణ ఇస్తున్న మదనపల్లె యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు ఎఆర్.సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ముున్ముందు కరాటే ఆణిముత్యాలు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.

నాణ్యతతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రామాపురం/లక్కిరెడ్డిపల్లె

ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి మండల అధికారులను ఆదేశించారు. బుధవారం రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్, మ్యుటేషన్లు, చుక్కల భూములు, ఇతర రెవెన్యూ సేవలు, అపార్ ఐడి జనరేషన్, హౌసింగ్ జియో ట్యాగింగ్, బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ తదితర అంశాలలో రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పిజిఆర్ఎస్ దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ప్రగతి బాగుందని, అన్ని రెవిన్యూ అంశాల్లో పెండింగ్‌లో లేరని, ఇలాగే కొనసాగించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని రెవెన్యూ అధికారులను అభినందించారు. హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించి, పనుల్లో వేగం పెంచాలని, పురోగతిని మెరుగుపరచాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పురోగతికి సంబంధించి పలు సూచనలు చేశారు. గ్రామాల, దశల వారీగా ఎల్ఎల్, బిబిఎల్, బిఎల్, ఆర్ఎల్, ఆర్సి స్థాయిల్లో సమీక్షించి, లబ్ధిదారులను చైతన్యపరచడం ద్వారా పురోగతిని మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల అపార్ ఐడి జనరేషన్‌కు సంబంధించి పనిని వేగవంతం చేయాలని ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 18 పనులలో 11 పనులు పూర్తి చేశారని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. హాజరు పట్టిక రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎంతమంది వైద్యులు,



రామాపురం : పిహెచ్‌సిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

నర్సులు, సిబ్బంది ఉన్నారు, ఖాళీల వివరాలు, ఆసుపత్రికి ఎక్కువగా ఎలాంటి రోగులు వస్తున్నారు, మందులు స్టాక్ ఉన్నాయా, మందుల కొరత ఏమైనా ఉందా అని ఆరా తీశారు. రోగులందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో భాగంగా సరిహద్దుల సర్వే రాళ్లపై ఉన్న చిత్రాలను, అక్షరాలను పూర్తిగా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వే రాళ్లపై బొమ్మలు, చిత్రాలు చెరిపి వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. సమావేశంలో డ్వామా, హౌసింగ్, డిఆర్‌డిఎ పీడీలు వెంకటరత్నం, శివయ్య, సత్యనారాయణ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, విఆర్ఒలు, హౌసింగ్ ఇంజనీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంఇఒలు, ఎపిడిలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కడప 'ఉక్కు' కోసం నిరవధిక దీక్ష చేస్తాం

- కొబ్బరికాయ కొట్టి వినూత్నంగా నిరసన తెలిపిన పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-కడప

కడప ఉక్కు పరిశ్రమ అంటే కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు చేసేందుకే పరిమితమైందని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రులు మారడం కొబ్బరికాయలు కొట్టడం ఇదే తంతుగా మారిందన్నారు. కడప జిల్లా ప్రజల చిరకాల కోరికైన కడప ఉక్కు పరిశ్రమ కట్టాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ అల్టీమేటం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే కాంగ్రెస్ పార్టీ తరపున ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేస్తామని, అవసరమైతై ఆమరణ నిరాహార దీక్ష చేయడానికైనా సిద్ధమని హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ పెట్టాలని విభజన చట్టంలో ఉందని తెలిపారు. బిజెపి ప్రభుత్వానికి పదేళ్ల నుంచి చంద్రబాబు, జగన్ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. 2014లో చంద్రబాబు సిఎం అయ్యాక ఉక్కు పరిశ్రమ కట్టమని బిజెపి చెప్పిందన్నారు. 2019లో ఉక్కు పరిశ్రమకు కొబ్బరికాయ చంద్రబాబు కొట్టారన్నారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఇంకో స్థలంలో కొబ్బరికాయ కొట్టారన్నారు. పది సంవత్సరాలు ఎంపీగా ఉన్న వైఎస్.అవినాష్‌రెడ్డి ఉక్కు పరిశ్రమ కోసం ఎన్ని సార్లు మాట్లాడారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆదేశాలతోనే అసభ్యకర పోస్టులు పెట్టారని తేలింది, మరి ఆయనను పోలీసులు ఎందుకు అదుపులోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు



కొబ్బరికాయ పట్టుకుని విలేకరులతో మాట్లాడుతున్న షర్మిల

ఎన్.డి.విజయ జ్యోతి, నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, ధ్రువకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు షర్మిల నివాళి

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద షర్మిల నివాళులర్పించారు. బుధవారం వైఎస్ఆర్ ఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పులివెందుల సమన్వయ కర్త ధృవ కుమార్‌రెడ్డి, నాయకులు బాలం వెంకటసుబ్బయ్య, వెలూరు శ్రీనువాసులురెడ్డి, వెంకటేష్, పెండ్లిమర్రి కన్వీనర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

యానిమేటర్ల తొలగింపును ఆపాలి

- సిఐటియు ఆధ్వర్యంలో మోకాళ్లపై ధర్నా



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విఒఎ (యానిమేటర్ల) తొలగింపును వెంటనే ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట మోకాళ్ళ మీద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి వెలుగు యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాణెమ్మ, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప కోశాధికారి సుబ్రహ్మణ్యం, క్రిష్ణమ్మ, పరంజ్యోతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనిమేటర్ల మీద పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో కలకడ, కెవిపల్లి, చిన్న మండెం, గాలివీడు మండలాల్లో ఎక్కువ రాజకీయ వేధింపులు పెరిగి తొలగింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి విచారణ లేకుండా తొలగిస్తుంటే సెర్ప్, డిఆర్‌డిఎ అధికారులు చేతులు కట్టుకొని చూస్తున్నారే తప్ప కూటమి నేతల అక్రమాలకు అడ్డు చెప్పే ధైర్యం చేయడంలేదని విమర్శించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసి అమలు చేయలేదని, పెండింగ్‌లోని అరియర్స్ ఇవ్వాలని కోరారు. కొందరు అధికారులు సంమిత్రలను రికార్డులు అప్పగిం చాలని చెప్పి బెదిరిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబును కలిసిన సందర్భంలో తొలగింపులకు మా ప్రభుత్వం వ్యతిరేకమని చెప్పిన చెప్పారన్నారు. కింది స్థాయి కూటమి నాయకులు ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోకుండా ప్రజలలో వ్యతిరేకతకు కారణవు తున్నారన్నారు. తక్షణం చోటా నాయకుల ఆగడాలు అరికట్టకుంటే ఉద్యమించాల్సి ఉంటుం దని హెచ్చరించారు. ఆరు నెలల పెండింగ్ జీతాలు మీద దృష్టి పెట్టాలని, విఒఎలను తొలగించడం మీద కాదని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎఒ అందించారు. కార్యక్రమంలో ఎపి వెలుగు యానిమేటర్ల సంఘం నాయకులు రమణారెడ్డి, శ్వేత,సుమతి రెడ్డిరాణి, నిర్మల, రాజగోపాల్, మాధవయ్య నాగసుబ్బయ్య, శ్రీరామ్ రెడ్డి, పవన్, విఒఎలు పాల్గొన్నారు.

బాధిత రైతులకు ప్రభుత్వ భూములిస్తాం : జెసి



రైతులతో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మదనపల్లి-తిరుపతి రహదారికి సంబంధించి వాహనాల పార్కింగ్ కోసం భూములు కోల్పోతున్న బాధిత రైతులకు మరొక్క చోట ప్రభుత్వ భూములను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్‌హెచ్ పార్కింగ్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ ఇప్పటికే ఎన్‌హెచ్ రోడ్ల నిర్మాణం కోసం భూములను కోల్పోయామని, ఉన్న అరకొర భూములను కూడా పార్కింగ్ పేరుతో లాక్కుంటే తాము ఎలా జీవనం సాగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూముల దగ్గరకు వెళ్లేందుకు ఎన్‌హెచ్ రోడ్డుకు అండర్ పాస్ ఏర్పాటు చేయమని ఎన్‌హెచ్ అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజన లేదన్నారు. దీనిపై స్పందించిన జెసి మాట్లాడుతూ రైతులు సహకరిస్తే పార్కింగ్ కోసం భూములను ఇస్తే వారికి మళ్లీ దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూములను అందిస్తామని తెలిపారు. అండర్ పాస్ విషయం కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పామిలేటి, ఎన్‌హెచ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి యూనియన్ నాయకులు బాసటగా నిలిచారు. నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి సర్కిల్ ఆటో యూనియన్ సభ్యుడైన మావిళ్ల రవికుమార్ (34) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బుధవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఈ నేపథ్యంలో శ్రీచౌడేశ్వరి ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు పురుం సహదేవ, నాయకులు ఆటో డ్రైవర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహదేవ తన వంతుగా రూ.10 వేలు, యూనియన్ సభ్యులందరూ కలిపి రూ.10 వేలు కలిపి రూ.20 వేలు రవికుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మృతి చెందిన డ్రైవరుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా పురుం సహదేవ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే రవికుమార్ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. ఆటో యూనియన్ నాయకుల సహకారంతో రూ.20 వేలు ఆర్థిక సాయం అందించామని, భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

విద్యార్థులకు అతిథి భోజనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని వైవిఎన్ పల్లె ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన ఎస్.పరశురామ్ కుమార్తె షన్విక పుట్టినరోజు సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గేని పెంచలయ్య ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతోపాటు అంగన్వాడీ చిన్నారులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఇఒ సుబ్బరాయుడు పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇండ్లలోని శుభకార్యాలను పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అతిథి భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమీల, పి.సుబ్బలక్ష్మి, సిఆర్‌పి సుబ్బారాయుడు, ఎక్స్ అఫీషియో సభ్యులు అనిలా, అంగన్వాడీ కార్యకర్త కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఇఒ సుబ్బారాయుడు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

10న సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

ప్రజాశక్తి-పీలేరు

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఉద్యోగుల హక్కైన పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. బుధవారం కెవిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో ఛలో విజయవాడ కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. 2004 సెప్టెంబర్ 1 నుంచి ఎవరైతే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులై ఉన్నారో వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని తొలగించి సిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానాన్ని అవలంబిం చడం జరిగిందని అన్నారు. ఈ విధానం వల్ల సిపిఎస్ ఉద్యోగస్తులకు ఆర్థికంగా , సామాజికంగా భద్రత లేదని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు సిపిఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగుల గుండెల్లో నిలవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైవి రమణ, సుబ్రమణ్యం, నందకుమార్, హరి నాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వేగన, ప్రభిత, భారతి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

రహదారి భద్రతపై అవగాహన సదస్సును ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల డైరెక్ట్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మదనపల్లి మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ దినేష్ చంద్ర మాట్లాడుతూ ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. దీనికి కారణం సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమేనని అన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ రోడ్డుపై అతివేగంగా వెళ్లడం వలన కూడా ఎన్నో మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు నిదానంగా వెళ్తూ గమ్యం చేరుకోవాలని చెప్పారు. కళాశాల డైరెక్టర్ రామ లింగారెడ్డి మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా నియమించిన సైన్ బోర్డ్స్ నియమాలను తప్పక పాటించి రోడ్డుపై మరణాల సంఖ్య తగ్గించాలని అన్నారు. రోడ్డు దాటేటప్పుడు ఇరువైపుల చూసుకొని వెళ్లాలని, బైక్ పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపల్ సతీష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అరుణ్ కుమార్ రెడ్డి , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భూపతి రాజును సన్మానిస్తున్న బాలరాజు

నిజమైన శ్రీమంతుడు భూపతిరాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని తాళ్లపాక, ఇసుకపల్లె, హెచ్.చెర్లోపల్లె, ఎంజి పురం నాలుగు గ్రామాలను దత్తత తీసుకున్న నిజమైన శ్రీమంతుడు డాక్టర్ భూపతి రాజు అని శాంతి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు ప్రశంసించారు. గ్రామాలను దత్తత తీసుకున్న సందర్భంగా శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పందేటి భూపతి రాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే 30 గ్రామాలను దత్తత తీసుకొని, అక్కడ తాగునీటి సమస్యను నివారించడమే కాకుండా ఉచిత వైద్యం, శ్మశాన వాటికల్లో క్రిమిటోరియంలు ఏర్పాటు చేయడం వంటివి చేయడం జరిగిందని భూపతి రాజు తెలిపారు.గతంలో కోవిడ్ మహమ్మారి విజ్రంభించిన వేళ అమెరికా నుండే రెండు కోట్ల రూపాయల కోవిడ్ పరికరాలను గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అన్ని ఆసుపత్రులకు అందజేసినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ శరత్ కుమార్ రాజు అభ్యర్ధన మేరకు ఈ నాలుగు గ్రామాలు దత్తత తీసుకోవడం జరిగిందని, ఇకపై ఇక్కడ త్రాగునీటి సమస్య లేకుండా చూస్తామని చెప్పారు. ఇవన్నీ పరిశీలించి గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శరత్ కుమార్ రాజు బాలరాజు ఘనంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, డాక్టర్ రవిరాజు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్‌కు గుర్తింపు తెచ్చిన ఘనత టిడిపిదే

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి టౌన్ బ్యాంక్ స్థాపించబడి వందేళ్లు అవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలను వైభవంగా నిర్వహిస్తామని నాదెండ్ల విద్యాసాగర్ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టౌన్ బ్యాంకు అభివృద్ధి కోసం టిడిపి ఎంతగానో కృషి చేసిందని అన్నారు. రెండు పర్యాయములు చైర్మన్‌గా, టౌన్ బ్యాంకు రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చేందుకు పని చేశామని అన్నారు. వారం రోజుల్లో జరగనున్న ఎన్నికలలో ఎమ్మెల్యే ఆశీస్సులతో పోటీ చేస్తున్న టిడిపి ప్యానల్ ను బలపరిచి గెలిపించాలని కోరారు. కొందరు సామాజిక మాధ్యమాల్లో మా పార్టీలోనే విభేదాలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో నాదెండ్ల విద్యాసాగర్ ప్యానెల్ ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసిటి. రవి కాంత్, టౌన్ బ్యాంక్ సోము, కలకడ వేణుగోపాల్, నవీన్ చౌదరి, పనికర్ రెడ్డి, మహర్షి, పసుపు పొడి రవి, జోలపాళ్యం చిన్ని, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాదెళ్ల విద్యాసాగర్



రక్తదానం చేసిన విద్యార్థులకు పండ్లు అందిస్తున్న తులసీ రామ్‌నాయుడు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, కళాశాల యాజమాన్యం, తిరుపతి ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆద్వర్యం లో రక్త దాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత, అవసరం అన్నారు. రక్తదానం అనేది ఒకరి ప్రాణాలను రక్షించడంలో సహాయపడే గొప్పదానమని, ప్రాణదానంతో సమానమని అన్నారు. ఇదొక నిస్వార్థమైన చర్య, సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత కూడా రక్తదానం చేయడంలోనూ దాతలు సురక్షితమైన రక్తాన్నే దానం చేయాలన్నారు. రక్తదానం చేసేందుకు అర్హులైన వారి సంఖ్య చాలా తక్కువ ఉంటుందన్నారు. గణాంకాల ప్రకారం మన దేశంలో ఆసుపత్రిలో చేరే ప్రతి ఏడుగురిలో ఒకరికి రక్తం అవసరం అవుతుందని చెప్పారు. కానీ అర్హులైన వారిలో కేవలం పది శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఏటా రక్తదానం చేస్తున్నారని చెప్పారు. రక్తదానం చేస్తే తమ ఆరోగ్యానికి ఏదైనా హాని ఉండొచ్చు అనే భయంతో వెనకడుగు వేస్తున్నారని, వాస్తవానికి రక్తదానం చేయడం వలన వారు వేరొకరికి ప్రాణం పోయడంలో సహాపడటమే కాకుండా రక్తదాతకు కూడా పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని అన్నారు.ఈ రక్తదాన శిబిరంలో సుమారు 160 మంది రక్త దానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమము లో అడ్వైసర్ ఆర్అండ్ డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, రవి, మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి : ఆర్‌డిఒ



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాస్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలని ఆర్‌డిఒ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని స్కాన్ సెంటర్ నిర్వాహకులు చట్టంకు లోబడి నిర్వహించుకోవాలని ఎలాంటి పరిస్థితుల్లో కూడా లింగ నిర్ధారణ చేసి ఆడ, మగ అనేది చెప్పకూడదని ఉన్నారు. స్కానింగ్ పరికరాలు వాటిని ఉపయో గించే వైద్యుల వివరాలు అనుమతి పొందిన ధ్రువపత్రాలకు సరిపోవాలని అన్నారు. అనుమతి లేని స్కానింగ్ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి గర్భిణి స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయబడవు అని బోర్డు పెట్టాలని సూచొిచారు. లింగ నిర్ధారణ చేసి అబార్షన్ చేయిం చుకోవడం నేరమంటూ ఐసిడిఎస్ ఎన్‌జిఒ మహిళా సంఘాల సహకారంతో ప్రజలకు అవగా హన కల్పించాలన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో సిసి కెమెరాల ఏర్పాటు ఉండాలన్నారు. మొదటి కాన్పులలో ఆడపిల్లలు పుట్టిన గర్భిణులపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. అబార్షన్ కోసం వాడే మందులు డాక్టరు సిఫార్సు లేకుండానే అందుబాటులో ఉన్నాయని దీనిపై చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో పిసిఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ ఉషాశ్రీ, పిసిపిఎన్ డిటి కార్యక్రమం అధికారి దేవా శిరోమణి, ప్రభుత్వ వైద్యులు నిసార అహ్మద్, చిన్నపిల్లల వైద్యులు నిలోఫర్ బేగం, స్త్రీల వైద్యులు జయరాముడు, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ వినోద్ కుమార్, ఐసిడిఎస్ సురేంద్రారెడ్డి, నాగేశ్వరయ్య, ఫరీదా బేగం, ఎన్‌జిఒలు నారాయణ, సిహెచ్ఒ ఉషారాణి, రాజగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, సూపర్ వైజరలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

శిక్షణ తరగతులను ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయం ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. శిక్షణా తరగతులను ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకొని విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమములో ఇన్‌ఛార్జి ప్రధానోపా ధ్యాయులు పాలెం రాజా, ఉపాధ్యాయులు ప్రేమరాణి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డిఇఒ


డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుకు పూల బోకే అందిస్తున్న టిడిపి నాయకులు

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును స్థానిక టిడిపి నాయకులు సూరపరాజు సుబ్బరాజు,మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రఘురామకృష్ణం రాజు డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా వారు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని రాజకీయ స్థితిగతుల గురించి వారు ఆయనతో చర్చించారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షత్రియులకు సముచిత స్థానం కల్పించారని వారు హర్షం వ్యక్తం చేశారు.

104 ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కలకడ

104 వాహనాల ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని మండలంలోని ఏనుగొండపాలెంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు రమేష్ బాబు, రోజా పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లను పరిగణలోకి తీసుకొని వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. 104ఉద్యోగులకు జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, పెనుగొండపాలెం ఎంపిటిసి ఈశ్వరయ్య నాయుడు పేర్కొన్నారు. ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు.

మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని వీరబల్లిలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, సర్పంచ్‌లు ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మన మరుగుదొడ్డి మన గౌరవం అంటూ గ్రామం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఎపిఒ నాగరాజ్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఇర్ఫాన్, సర్పంచ్ లు నాగార్జున చారి, నేతి ఆంజనేయులు, గోపీనాథ్ రెడ్డి, సర్పంచ్ తనియలు రవి, శివ, పంచాయతీ కార్యదర్శులు వరప్రసాద్, పద్మావతి, రాజశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ స్రవంతి రెడ్డి పేర్కొన్నారు. కడప సాయి నర్సింగ్ హోమ్ వైద్య నిపుణులు డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో కంటిలో శుక్లం గలవారికి మధురై కంటి ఆపరేషన్ ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్ కార్డు ఒరిజినల్ తప్పక తీసుకొని రావాలని పేర్కొన్నారు.

సమర్ధవంతంగా పాఠశాల సముదాయ సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట


మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో సముదాయ సమావేశాలను సమర్ధవంతంగా సృజనాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని ఎంఇఒ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ వన్ టీచర్ వన్ టిఎల్ఎం అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని పేర్కొ న్నారు. పాఠశాల నుంచి కాంప్లెక్స్ సమావేశానికి వచ్చే ప్రతి ఉపాధ్యాయుడు తాము పాఠశాలలో ఉపయోగించిన ఒక బోధనాభ్యాసన సామగ్రిని తీసుకువచ్చి దాని ఉపయోగం తయారీ గురించి చక్కగా వివరించడం జరిగిందని అన్నారు. అనంతరం కి రిసోర్స్ పర్సన్ రమణ మాట్లాడుతూ బోధనలో బోధన అభ్యసన సామగ్రి ఉపయోగించడం వల్ల పిల్లలు సులభంగా అర్థం చేసుకో వడమే కాక ఎప్పటికీ గుర్తుంటాయని అన్నారు. ఇలా అందరూ ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ విశ్వనాథ్ , మాధవి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

పల్లె పండుగలో రోడ్ల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంత రోడ్ల సమస్యలకు పల్లె పండుగ కార్యక్రమం ఓ చక్కటి అవకాశం అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ యార్డు సమావేశ భవనంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో సమస్యగా ఉన్న రోడ్లలో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇంకా సమస్యలు ఉంటే మళ్ళీ దశలో రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా వాల్మీకిపురంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పీలేరు టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్‌బాషా, జాకీర్, డిష్ బ్రదర్స్ తదితరులకు కడప పెద్ద దర్గాకు సమర్పించేందుకు చాదర్‌ను ఎమ్మెల్యే నల్లారి కిషన్ కుమార్‌రెడ్డి తరపున నిరంజన్ రెడ్డి అందించారు.కార్యక్రమంలో నాయకులు పులి నరేంద్ర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కోసూరి చంద్రమౌళి, రాజేంద్రచారి, పివి నారాయణ, బొక్కసం రామక్రిష్ణ, ఆనంద పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేయడమే మంత్రి 'మండిపల్లి' లక్ష్యం


ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని టిడిపి మండల యువ నాయకుడు యనమల మదనమోహన్ తెలిపారు. ఇప్పటికే తాగునీటి సమస్యలతో బాధపడుతు న్నటువంటి అనేక గ్రామాలలో ఉచిత తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారని అన్నారు. అనేక గ్రామాల్లో సిసి రోడ్లు ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి రోడ్డు కనెక్టివిటీ పెంచారని అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా, గురుకుల పాఠశాలకు ప్రహరీ సైతం నిర్మిస్తు న్నారని చెప్పారు. గత ప్రభుత్వం హయంలో గుంతలు పడిన రోడ్డులను సైతం మరమ్మతులు చేయిస్తున్నారని అన్నారు. అన్నారు.రాయచోటి-కడప జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌ని టన్నెల్‌ను నిర్మించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. మండలాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెడుతు న్నారన్నారు. మండలంలో ఇప్పటికే 8 వేల సభ్యత్వాలు చేశామని రాయచోటి తాలూకాలో లక్కిరెడ్డిపల్లి మండలం మొదటి స్థానంలో ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాజంపేట డాక్టర్ సెల్ కార్యదర్శి డాక్టర్ షఫినాయక్, హేమంత్, మల్లికార్జున, మసూద్, డీలర్ అన్వర్, ముక్తార్ అహ్మద్, హరికృష్ణ పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-పీలేరు

విజ్ఞానార్జన కోరుకునే ప్రతి ఒక్కరికీ గ్రంథాలయాలు ఎంతో ఉపయోగ పడతాయని వక్తలన్నారు. 75వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం పీలేరు ద్వితీయ శ్రేణి ప్రాంతీయ గ్రంథాలయంలో, గ్రంథాలయ అధికారి అమర్నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ మన పూర్వీకులు సాధించిన విజ్ఞాన, విజయాలు పుస్తక రూపంలో గ్రంథాలయాల్లో పాఠకులకు అందుబాటులో ఉంచారని తెలిపారు. ఇక్కడ విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని కోరుకునే అన్ని వయస్సుల వారికి అందుబాటులో దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు ధార్మిక, సామాజిక స్ఫూర్తినిచ్చే రకరకాల గ్రంథాలు, నవలలు, కథల పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువ తకు ఉపయోగపడే విద్యా సామగ్రి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవిశంకర్, ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి, పంచా యితీ ఇఒ గురు మోహన్, జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేంద్ర రెడ్డి, సి.ఆర్.పి జలకనూరి మురళీధర్ రాజు, ఉపాధ్యాయులు భాస్కర్, నరసింహులు, షాహిద్‌బాషా,విద్యార్థులు, పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడలో గత వారం రోజులుగా జరుగుతున్న భాగంగా ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించి గ్రంథాలయ వారోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి అమరనాథ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో ముగింపు కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సంబేపల్లి/రాయచోటి :** విద్యార్థులు చిన్ననాటి నుంచి ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం పేర్కొన్నారు. బుధవారం ఉదయం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ యువకులు, విద్యావంతులు, విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండి అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం సంబేపల్లి బ్రాంచ్ గ్రంథాలయం రికార్డ్ అసిస్టెంట్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన పావని, ఆఫ్రా, జ్యోత్స్న, మానస, యశ్రిత, శరన్, ఉజ్వల్ నాయక్, ప్రణీత్, మస్తాన్, వెంకట జస్వంత్ లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రెడ్డిశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక గ్రంథాలయం వద్ద గ్రంథాలయ ముగింపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గుశ్వరరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది పిల్లల్లో చురుకుదనాన్ని నింపడం కొరకమే గ్రంథాలయ సిబ్బంది పోటీలు పరీక్షలు నిర్వహించి బహుమతులు అందివ్వడం అభినందనీయమని అన్నారు. ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ వసంత లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ ఇష్టంతో కష్టపడి చదివి సాధించాలన్నారు. వ్యాసరచన, పోటీ డ్రాయింగ్, ముగ్గుల పోటీ లలో, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు కార్యక్రమంలో లైబ్రరీ రామచంద్ర నాయక్, పీడీ భాను, శ్రీ రాయలసీమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహంతుల్లా, ఉపాధ్యా యులు,


మదనపల్లి : బహుమతులు అందజేస్తున్న అమరనాథ రెడ్డి

విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి:** పుస్తకాలు చదవడం వలన పెరుగుతుందని ఇఒపిఆర్‌డి రామచంద్ర రెడ్డి, వివేకానంద స్కూల్ హెడ్మాస్టర్ మధుసూదన్ రెడ్డిలు అన్నారు. గ్రంథాలయ శాఖ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బు 57వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొన్నారు. విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపిఇపి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రెడ్డప్ప రెడ్డి, విద్యా ర్థులు పాల్గొన్నారు. **మదనపల్లి :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కురుబలకోట మండలంలో ఏర్పాటు చేయబడిన శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాచారచన పోటీలు, మహిళా సాధికారత చర్చ పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసినట్లు గ్రంథాలయ అధికారి చంద్ర శేఖర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ, బి.అమర్నాథ్ రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య, ఎంఇఒ ద్వారకనాథ్, పంచాయితీ సెక్రెటరీ శేషగిరిరావు, డిఎల్‌పిఒ మాట్లాడుతూ పుస్తకాలు తో పాటు విశ్వవిజ్ఞానని పెంచే పుస్తకాలు గ్రంథాలయంలో ఉంటుందని అవి కూడా చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. వీరు చేతులు మీదగా గెలుపు పొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎం. నాగమణి, విద్యార్థులు,ఎ ాలకులు సి.శివప్రసాద్, ఎస్. శ్రీనివాసులు గ్రంథాలయ సిబ్బంది పద్మవతమ్మలు పాల్గొన్నారు. **కలికిరి:** గ్రంథాలయాలతోనే విద్యార్థులు మేధో సంపన్నులు అవుతారని గ్రంథాలయ అధికారి విజయకుమార్ తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం ముగింపు కార్యక్రమం శాఖ గ్రంథాలయం కలికిరి నందు గ్రంథాలయ అధికారి విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిఒ ఎంపిపి గణిత ఉపాధ్యాయుడు ప్రభాకర్ హాజరై గ్రంథాలయ వారోత్సవాలు వారం రోజులు పాటు ఎంతో మంది విద్యార్థులు, పాఠకులు హాజరై వారోత్సవాలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. **రాజంపేట అర్బన్ :** గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, ఎంఇఒ రఘునాథరాజు, సబ్ జైలు సూపరింటెండెంట్ మల్‌రెడ్డి, ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామా నుజులు పాల్గొని మాట్లాడారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. **తంబళ్లపల్లి :** గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు, వివిధ రకాల క్రీడలు నిర్వహించిన వాటిలో విజేతలకు ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి, ఎంఇఒ త్యాగరాజు బహుమతులు అందిం చారు. కార్యక్రమంలో ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి, ఉపాధ్యాయులు గ్రంథాలయ అధికారి జిలాని భాషా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం : డిఎఒ


చిన్నమండెం: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-నందలూరు

ప్రకృతి సేద్యం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకొని భూసారం పెంచుకోవచ్చని, తద్వారా మంచి దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. మండలం లోని లేబాక మంగమాంబాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమా గురించి రైతులకు తెలిపారు. రాజంపేట సహాయక వ్యవసాయ సంచాలకులు జి.రమేష్ బాబు మాట్లాడుతూ ట్రేకో డెర్మ విరిడి సబ్సిడీ కి లభిస్తుం దని, నువ్వులు కొత్త రకం కృషి విజ్ఞాన కేంద్రం కడప నందు లభించునని తెలిపారు. ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు మాట్లాడుతూ మామిడిలో సమగ్ర సస్యరక్షణ విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం వ్యవ సాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని గోపనపల్లి,అరవీడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నేలను సారవంతం చేయుటకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో ఒకటైన రబిడ్రై షోయింగ్ ను పాటించాలని అన్నారు. ఇందులో అలసంద, అనుములు, పెసర, ఆముదాలు, కంది, ఉలవ, కట్టజనము, జీలుగా, పిల్లి పెసర, సజ్జ, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, ధనియాలు, ఆవాలు, కొర్రలు మొదలగు విత్తనాలు వేసి పెంచి పూత దశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నడం వల్ల భూమిలో కర్బన శాతం పెరిగి తర్వాత పెట్టే పంటలో అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ద్రవ జీవా మృతాన్ని తయారుచేసి అక్కడికి వచ్చిన రైతులకు చూపించి ద్రవ జీవా మృతం ఉపయోగాలు విరించారు. 10 లీటర్ల ఆవు మూత్రం, ఐదు కేజీల ఆవు పేడ, రెండు కేజీల శెనగపిండి, రెండు కేజీల బెల్లం, పుట్టమన్ను కలిపి ద్రవ జీవా మృతాన్ని తయారు చేసి చూపించారు. ఇలా తయారుచేసి ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రధాన పొలంలో వాడినట్లయితే భూమి సారవంతం పెరిగి మంచి దిగుబడులు వచ్చేదానికి అవకాశం ఉందన్నారు. గ్రామంలో రైతులతో కలసి సమావేశం ఏర్పాటు చేసి మేలైన వ్యవసాయ విధానాలను రైతులతో చర్చించి వారికి వివరించారు. ప్రకృతి వ్యవసాయం పాటించినట్లయితే ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎఒ వెంకటరామిరెడ్డి, ఎన్ఎఫ్ఎం టి.వెంకటరమణ, డిఎం ఎంటి. రామయ్య, నాగరాజు, ఎఇఒ, ఎల్1, ఎల్3, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** రైతులు ప్రకృతి వ్యవసాయంతోనే అధిక ఆదాయాన్ని పొందుతారని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ తెలిపారు. బుధవారం పొలం పిలు స్తోంది కార్యక్రమంలో భాగంగా వత్తలూరు పంచాయతీలోని మల్లెంవారిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ ఇ-పంట నమోదు గురించి, పంటలలో మేలుకోలు గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది లక్ష్మీదేవి మాట్లా డుతూ ఇ-పంట నమోదు రబీలో చేయించు కోవాలని వివరించారు. కార్యక్ర మంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసిఆర్‌పి ప్రభాకర్, లోకేశ్వర్ రెడ్డి, సునీతా దేవి, ఇంద్రజ రైతులు పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల పరిధిలోని బోనమల కేసాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని సహాయ వ్యవ సాయ సంచాలకులు శ్రీలత, ఎంఎఒ గీత నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎడిఎ రైతులు అందరూ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. టమోటా, వేరుశనగ పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు, వరికి 31వ తేదీలోగా ప్రీమియం చెలించాలని చెప్పారు. టమోటా ఎకరానికి ఎకరానికి రూ.1600లు, వేరుశనగకు రూ.96లు, వరికి రూ.196 లు చెలించాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బికె సిబ్బంది పావని, సింధుజ గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **రామాపురం :** ఈ రబీ సీజన్‌లో వరి వేరు శనగ పంటలు సాగు చేసే రైతులు తెగుళ్ళను వాతా వరణ పరిస్థితులను తట్టుకోగల కొత్తరకం వంగడాలను సాగు చేసుకోవాలని ఎడిఎ జయరాణి, ఎంఎఒ నాగవేణి రైతులకు సూచించారు. మండలం లోని నీలకంఠరావుపేట, శుద్ధమల్ల రైతు సేవ కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ సిఎఒ సుచిత్ర, రైతు సేవ కేంద్ర రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ఎంపిడిఒ సభా భవన్‌లో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఎంపిడిఒ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం మొదలు కాబోతుంది ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ఏ నిధులు ద్వారా అయినా పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా సమస్యను తీర్చే విధంగా ప్రయత్నం చేద్దామన్నారు. అన్ని చోట్లా వర్షాలు కురిసినా వీరబల్లి మండలంలో తక్కువ వర్షపాతం నమోదైందని అన్నారు. ఈ మండలాన్ని కరువు మండలాల ప్రకటించాలని జడ్‌పి సమావేశంలో చెబుతానని పేర్కొన్నారు. ఎంపిపి మాట్లాడుతూ అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో అయ్యా శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

భారీ భద్రత నడుమ ఆక్రమణలు తొలగింపు

- పర్యవేక్షించిన కమిషనర్ పల్లవి, సిఐ రాజారెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గత కొన్ని సంవత్సరాలుగా బి.కొత్తకోట పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలో గల స్థలాలను అక్రమించిన అక్రమార్కులు బంకులు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. బంకులు ఏర్పాటు చేసుకున్న వారు స్వచ్ఛందంగా వాటిని తొలగించాలని వారం రోజులు గడువు ఇచ్చి నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆక్రమణదారులు స్పందించకపోవడంతో మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రత నడుమ సిఐ రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జివి.పల్లవి ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. పట్టణంలో విద్యుత్ స్తంభాలు , ట్రాన్స్‌ఫార్మర్‌లు, మురుగునీటి కాలువలకు ఇవతలి వైపు ఉండడంతో వాటిని ఆసరా చేసుకుని బంకులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను రోడ్డుకు అవతలి వైపు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్, ఎఎస్ఐ బొజ్జా నాయక్, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, రామాంజులు, నాగరాజుగౌడ్, కానిస్టేబుల్ నరసింహులు పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి


జాతీయ రహదారిపై నిరసన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నష్టపరిహారం చెల్లించాలి

- జాతీయ రహదారిపై రైతుల నిరసన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం,అంగళ్లు పంచాయతీ సర్వేనెంబర్ 162,130 తదితర సర్వే నంబర్లలో జాతీయ రహదారికిగాను తమ భూములు సేకరించి నష్టపరిహారం చెల్లించక పోవడంతో బుధవారం జాతీయ రహదారిపై రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా వారు మాకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను రోడ్డుకు సేకరించి నష్టపరిహారం ఇంత వరకు అందించ కపోవడం బాధాకరమని అన్నారు. మాకు న్యాయం చేసేంతవరకు రోడ్డుపై ఎటువంటి వాహనా లు వెళ్లడానికి, మరమ్మతులు చేయడానికి వీలు లేదని రైతులు హెచ్చరిం చారు. మాకు న్యాయం చేసేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్‌ను కలిసిన తోట కల్యాణ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె


శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తోట కళ్యాణ్

మదనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట కల్యాణ్ ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు సందర్భంగా ఆయనను మర్యాద పూర్వ కంగా కలిసిశుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శరవేగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతోందని అన్నారు. ఓవైపు యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి పరిశ్రమలను తీసుకువస్తూ, మరోవైపు స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు అందిస్తూ వారికి అండగా కూటమి ప్రభుత్వం నిలబడుతున్నాదని తెలిపారు. ఈ సందర్భంగా మదనపల్లెలో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాలను పరిశీలించి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల ప్రజలకు అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందని కోరారు.

డిసెంబర్ చివరి నాటికి గృహాలు పూర్తి చేసుకోవాలి : పీడీ

ప్రజాశక్తి-రామాపురం

వివిధ దశల్లో ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాలు డిసెంబర్ చివరినాటికి పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లి హౌసింగ్ లేఅవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంజూరైన పక్కా గృహాలు ఎల్ఎల్ బిబిఎల్ బిఎల్ఆర్ఎల్ ఆర్‌సి స్థాయిల్లో ఆగిపోయిన పక్క గృహాలు డిసెంబర్ చివరినాటికి నిర్మాణ పనులు చేసుకుంటే బిల్లులు అందించడం జరుగుతందని అన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని త్వరగా నిర్మాణం పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఎఇ, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం : జడ్జి

ప్రజాశక్తి-నందలూరు


మాట్లాడుతున్న జడ్జి జె.నందిని

డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ సంబంధించి రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జె.నందిని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలో గల పోలీసు అధికారులతో బుధవారం జడ్జి క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ జాతీయ లోక్ అదాలత్ సంబంధించి ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగులు నిర్వహించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో రాజంపేట రూరల్ సిఐ బివి రమణ, నందలూరు, పెనగ లూరు, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, పి.రవిప్రకాష్‌రెడ్డి , పుల్లంపేట ఎఎస్ఐ పిచ్చయ్య, రాజంపేట ఎక్సైజ్ ఎస్ఐ సుధాకర్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ, ఆటో ఢీ : మహిళ మృతి

- 12 మందికి గాయాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

చిన్నమండె-మదనపల్లి జాతీయ రహదారి పైన బెస్తపల్లి క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం ఐచర్ లారీ ఆటోను ఢీకొట్టడంతో లక్ష్మీదేవి అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో 12 మంది మహిళలకు తీవ్ర గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి తీవ్ర విష మంగా ఉందన్నారు. ఈ మహిళలు కలిబండకు చెందినవారని వీరంత టమోటా పొలం పని కి వెళ్లి తిరిగి ఆటోలో వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్ఐ సుధాకర్ అంబులెన్స్ ఏర్పాటు చేసి గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం, డిండిగల్ జిల్లా పెరియకోటకు చెందిన మారిముత్తు (45) స్థానిక సిటిఎం రోడ్డులోని దేవతానగర్‌లో ఉన్న బంధువుల ఇంటికి ఈ నెల17వ తేది రాత్రి బైకుపై బయలుదేరాడు. మార్గమధ్యంలోని బైపాస్ రోడ్డులోని రాయల్ హోటల్ వద్దకు గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు బాధితున్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎలుకల మందు తాగి యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన బుధవారం పిటిఎం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. పిటిఎంలో ఉంటున్న పద్మావతి బెంగుళూరుకు చెందిన ఓ యువకుడిని వివాహం చేసుకుందన్నారు. కొంతకాలం సజావుగా సాగిన వీరి సంసారంలో గొడవలు ప్రారంభమయ్యాయని తెలిపారు. భర్తను వదిలి స్వగ్రామానికి వచ్చేసింది. భర్త ప్రవర్తనపై తీవ్ర మనస్తాపం చెందిన పద్మావతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. కుటుంబీకులు బాదితురాలిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.